మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శనివారం 11-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 171

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


# అమెరికాతో ఆటలొద్దు




- ఇరాన్‌కు జేడీ వాన్స్ తీవ్ర హెచ్చరిక.
- ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా శాంతి చర్చలు.
- విశ్వసనీయతతో ఉండాలి, లేదంటే పరిణామాలు తీవ్రం: వాన్స్.
- పాకిస్థాన్ ప్రధాని మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన చర్చలు.
- ట్రంప్ ఆదేశాలతో రంగంలోకి వాన్స్, కుష్నర్ బృందం.

**న్యూఢిల్లీఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
అమెరికాతో ఆటలు ఆడాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించినందున శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లే ముందు వాన్స్ మీడియాతో మాట్లాడుతూ అమెరికా వైఖరిని స్పష్టం చేశారు. తమ అధ్యక్షుడి ఆదేశాల మేరకు దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ సమయంలో ఇరాన్ తమతో

-మిగతా 3 లో



## బెంగాల్ ఓటర్లకు బీజేపీ తాయిలాలు

- మహిళలు, నిరుద్యోగులకు నెలకు రూ. 3,000 సాయం
- ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ భారీగా ఉచిత హామీలు

**న్యూఢిల్లీ,**
ఉచితాలకు తాము వ్యతిరేకమని చెప్పుకొనే భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు భారీగా తాయిలాలు ప్రకటించింది. ప్రతి మహిళ, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందచేస్తామని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘాన్ని నియమిస్తామని హామీ ఇవ్వడంతోపాటు చొరబాటుదారుల పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తామని వాగ్దానం చేసింది.పోలీసు శాఖసహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూడా బీజేపీ హామీ ఇచ్చింది.

-మిగతా 3 లో

## 'దీపం' లబ్ధిదారులకూ పీఎన్‌జీ


ఏడాదికి రూ. 2,400 సబ్సిడీ.. ఉత్తర్వులు జారీ..

- లబ్ధిదారులకు అవగాహన కల్పించండి: చంద్రబాబు
- 6 నెలల్లో 10 లక్షల కనెక్షన్లు ఇవ్వాలి
- ఆయిల్ కంపెనీలతో సీఎం సమీక్ష
- శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ కోసం కేంద్ర మంత్రికి ఫోన్

**అమరావతి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
'దీపం-2' పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందుతున్న లబ్ధిదారులకు కూడా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ)ను సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు (పీఎన్‌జీ) ఎల్పీజీ కంటే సురక్షితమైందని, పర్యావరణ అనుకూలమైందని ప్రభుత్వం చెబుతోంది. పైగా ఎల్పీజీ సిలిండర్ల రవాణా భారం తగ్గడంతో పాటు వినియోగదారులకూ ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని భావిస్తోంది. పీఎన్‌జీకి సబ్సిడీ లేకపోవడంతో ప్రజలు దాని వినియోగంపై పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదని ప్రభుత్వం గమనించింది.

-మిగతా 3 లో





## వైభవ్ దెబ్బ.. ఆర్సీబీ అబ్బా

హేజిల్‌వుడ్‌ను కూడా వదల్లేదుగా..!

- ఐపీఎల్ 2026లో ఆర్సీబీకి తొలి ఓటమి
- ఆర్‌ఆర్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- వరుసగా నాలుగో విజయం సాధించిన ఆర్‌ఆర్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ హవా కొనసాగుతోంది. ఈ సీజన్‌లో రెండోసారి అతడు 15 బంతుల్లో హాఫ్ సెంచరీ స్కోరు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో శుక్రవారం జరిగిన మ్యాచులు ఈ చిచ్చరపిడుగు విధ్వంసం సృష్టించాడు. 26 బంతుల్లో ఏకంగా 78 పరుగులు చేశాడు. హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ లాంటి బౌలింగ్‌లోనూ ఊచకోత కోశాడు. దీంతో ఈ టోర్నీలో ఆర్‌ఆర్ వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్

-మిగతా 3 లో




## నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని
- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు

**ఇస్లామాబాద్**
అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు

-మిగతా 3 లో



## వివాదంలో మోనాలిసా పెళ్లి

- పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు
- భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

3

## టోల్ ప్లాజాల వద్ద ఇక నో క్యాష్ పేమెంట్స్

- అమల్లోకి కొత్త నిబంధనలు




3



## 9,436 కోట్ల ప్రతిపాదనలకు ఓకే

- 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- అకాడమీ నిర్మాణం కోసం సింధూకు ఇచ్చిన గడువు మరో ఏడాది పొడిగింపు
- మార్కాపురం ప్రమాద మృతులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద పరిహారం
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయాలు

**అమరావతి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా వివిధ శాఖల పరిధిలో రూ.39,436 కోట్ల విలువైన ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్-2025 నిబంధనల ప్రకారం, రాష్ట్రంలోని నాలుగు జోన్లను ఆరు జోన్లుగా, రెండు మల్టీ జోన్లను మూడు మల్టీ జోన్లుగా మార్చుతూ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన

-మిగతా 3 లో



## యువత సవాళ్లను స్వీకరించాలి

- ట్రెండ్‌ను అనుసరించొద్దు... లక్ష్యంపై దృష్టి పెట్టాలి
- షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం: లోకేశ్

**అమరావతి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
యువత సవాళ్లను స్వీకరించాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు మారిపోయే ట్రెండ్‌ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలని కోరారు. బెంగళూరు సర్జాపూర్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీ డిప్లొమా ప్రోగ్రామ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ రోజును కేవలం గ్రాడ్యుయేషన్ డేగానే చూడకూడదని విద్యార్థులు

-మిగతా3 లో

## 20న బీఆర్‌ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

జగిత్యాలలో భారీ బహిరంగసభ

- ముఖ్యఅతిథిగా రావాలంటూ కేసీఆర్‌కు జీవన్‌రెడ్డి విజ్ఞప్తి
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే పంపాడన్న మాజీమంత్రి
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్

**మర్కుక్ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
మాజీమంత్రి టి జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరడానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 20న ఆయన గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. అదేరోజు జగిత్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ భావిస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిశారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఉన్న ఈ ఇద్దరు నేతలు, తాజా పరిణామాల నేపథ్యంలో అత్యంత ఆత్మీయంగా కలుసుకున్నారు.

-మిగతా 3 లో



## పాములైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత

3




## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



**అలహాబాద్ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** జస్టిస్ యశ్వంత్ వర్మ జడ్జి పోస్టుకు గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆయన రాష్ట్రపతిని కోరారు. నిరుడు ఢిల్లీ హైకోర్ట్ జడ్జిగా ఉన్నప్పుడు ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు లభించడం రాజకీయ, న్యాయ వర్గాల్లో పెను దుమారం రేపింది. దీనిపై పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపింది.మొదట ఆ ఘటనతో తనకు సంబంధం లేదని.. ఆ సమయంలో తాను అక్కడ లేనని, తనను ఎందుకు అభిశంసించాలని జస్టిస్ వర్మ ప్రశ్నించారు. అయితే ఘటన జరిగిన గదిపై జస్టిస్ వర్మ కుటుంబానికి నియంత్రణ ఉందని పార్లమెంటరీ విచారణ కమిటీ తెలిపింది. మరోవైపు ఆయనను అభిశంసించాలని 146 మంది ఎంపీలు చేసిన తీర్మాన ప్రతిపాదన త్వరలోనే పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ రాజీనామా చేయడం గమనార్హం.

## లెబనాన్‌పై బాంబుల వర్షం... మళ్లీ విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

### హెజ్బొల్లా ప్రతీకార దాడులు



**టెల్ అవీవ్ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించనప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ వెనక్కి తగ్గడం లేదు. దక్షిణ లెబనాన్‌లోని పట్టణాలపై శుక్రవారం మళ్లీ ఇజ్రాయెల్ భీకర దాడులకు దిగినట్టు లెబనాన్ ఆరోపించింది. దీంతో ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దు పొడవునా ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ దాడులకు ప్రతీకారంగా హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు జరిపింది. ఇజ్రాయెల్ పౌరులు నివసించే మిస్గావ్‌పై రాకెట్ దాడి చేసినట్లు ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా ప్రకటించింది. లెబనాన్, దేశ ప్రజల ఆత్మరక్షణ కోసం ఈ దాడులు జరిపినట్లు హెజ్బొల్లా వర్ణించింది.ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఉల్లంఘనలు, దక్షిణ లెబనీస్ గ్రామాలపై నిరంతర దాడులకు సమాధానంగా ఈ దాడి చేసినట్లు పేర్కొన్నది. ఒకే లక్ష్యంపై ఇది రెండవ దాడిగా పేర్కొన్న హెజ్బొల్లా లెబనాన్‌పై దాడులు కొనసాగినంత కాలం తమ ప్రతిదాడులు ఆగవని హెచ్చరించింది. దీనిపై ఇజ్రాయెల్ నుంచి అధికారికంగా ఎటువంటి స్పందన లేదు. ఇలా ఉండగా ఇజ్రాయెల్‌తో చర్చలకు కాల్పుల విరమణ తమ ముందస్తు షరతుగా లెబనాన్ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు.

## యమునా నదిలో పడవ బోల్తా.. పది మంది మృతి, పలువురు గల్లంతు



**లక్నో: ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** పర్యాటకులతో వెళ్తున్న పడవ యమునా నదిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పది మంది మరణించారు. మరికొందరు గల్లంతయ్యారు. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన సుమారు 30 మంది ఉత్తరప్రదేశ్‌లోని బృందావనాన్ని సందర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు బోట్లలో యమునా నదిలో ప్రయాణించారు.కాగా, బలంగా వీచిన గాలులకు ఒక బోటు తీవ్రంగా ఊగిపోయింది. పాంటూన్ వంతెనను ఢీకొట్టడంతో ఆ పడవ బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నదిలో గల్లంతైన వారి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు పంజాబ్‌లోని లూథియానాకు చెందిన పది మంది పర్యాటకుల మృతదేహాలను ఇప్పటివరకు వెలికితీశారు. నదిలో గల్లంతైన మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో సహా పలువురు ఉన్నతాధికారులు పరిస్థితిని పర్యవేక్షించేందుకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత



**కోల్‌కతా, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షితను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

## ఆ ఊళ్లో బూతులు మాట్లాడితే జేబుకు చిల్లు పడినట్లే


**న్యూఢిల్లీ: ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** అది పూర్తిగా బూతుల రహిత గ్రామం..! ఆ గ్రామంలో బూతులు మాట్లాడటంపై నిషేధం ఉంది..! నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా బూతులు మాట్లాడితే వారి జేబుకు చిల్లుపడినట్లే. ఏకంగా రూ.500 జరిమానా కట్టాల్సిందే. ఈ మేరకు ఆ గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని గ్రామ పెద్దలు చెప్పారు.సాధారణంగా గ్రామాల్లో అయినా, పట్టణాల్లో అయినా గొడవలు జరుగుంటాయి. ఈ గొడవల సందర్భంగా బూతులు కూడా దొర్లుతాయి. ఇలా బూతులు జారడంవల్ల చిన్న గొడవలు కూడా పెద్దవిగా మారుతాయి. అందుకే మధ్యప్రదేశ్ రాష్ట్రం




బుర్హాన్‌పూర్ జిల్లాలోని బోర్‌సర్ గ్రామంలో బూతులపై పూర్తిగా నిషేధం విధించారు. నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. బుర్హాన్‌పూర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ గ్రామంలో 6 వేల మంది జనాభా ఉంటారు. గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా ఎవరు బూతులు మాట్లాడినా రూ.500 జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే గంటసేపు గ్రామంలో పారిశుధ్య పనులు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామమంతా పోస్టర్లు వేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, బూతులతో గొడవలు పెద్దవి చేసుకోకుండా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేయిస్తున్నామని సర్పంచి అంతర్‌సింగ్ తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశామని, అదేవిధంగా నాలుగుచోట్ల ఉచిత వైఫై సదుపాయం, గ్రామం అంతటా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.

## హెర్ముజ్‌లో అమెరికా డ్రోన్ మిస్సింగ్!

### ధర రూ.1,800 కోట్లు



**వాషింగ్టన్ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** అగ్రరాజ్యం అమెరికాకు మరో భారీ షాక్. హెర్ముజ్‌లో సీక్రెట్ ఆపరేషన్ సందర్భంగా ఆ దేశానికి చెందిన నిఘా డ్రోన్ ఎంక్యూ-4సీ ట్రైటన్ గల్లంతైంది. ఈ డ్రోన్ ధర రూ.1800 కోట్లకు పైమాటే. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా పెద్ద ఎత్తున యుద్ధ విమానాలను కోల్పోయిన సంగతి తెలిసిందే.తాజాగా అత్యంత ఖరీదైన డ్రోన్ కనిపించకుండా పోవడం ఆ దేశానికి గట్టి ఎదురుదెబ్బే అని భావిస్తున్నారు. ఈ డ్రోన్ కూలిపోయిందా లేక ఇరాన్ కూల్చిందా అన్న విషయం తెలియరాలేదు. 2018లో ఈ డ్రోన్ అమెరికా అమ్ములపొదిలో చేరింది. ఇరాన్ యుద్ధంలో ఎఫ్-35, ఎఫ్-15ఈ, ఏ-10 యుద్ధ విమానాలను అమెరికా కోల్పోయింది. అలాగే 17 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లను కూడా నష్టపోయింది.

## ఆయుధాలతో యుద్ధ నౌకలు సిద్ధం..

### ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలకు సమయం ముంచుకొస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఇరాన్ వద్ద ఇక ఏ మార్గమూ మిగల్లేదని, కీలక అంతర్జాతీయ జలమార్గాలపై నియంత్రణ ద్వారా ప్రపంచాన్ని స్వల్పకాలికంగా దోచుకోవడంపై మాత్రమే ఇరాన్ ఆధారపడుతున్నదని ట్రంప్ విమర్శించారు.తమ వద్ద వేరే మార్గాలు లేవని ఇరానీయులు ఇంకా గ్రహించినట్లు లేరని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఈ రోజు సజీవంగా ఉండడానికి ఏకైక కారణం చర్చలు జరపడమే అని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో శాంతి చర్చలు విఫలమైతే దాడులను పునరుద్ధరించడానికి శక్తివంతమైన ఆయుధాలతో అమెరికా యుద్ధ నౌకలను సిద్ధం చేస్తున్నట్లు న్యూయార్క్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరికలు జారీచేసిన కొన్ని గంటల్లోనే ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

## 40 రోజుల్లో 5000 మంది ఇరానీ సైనికులు మృతి: ఐడీఎఫ్


**జెరుసలాం ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై ఆకస్మిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై జరిగిన దాడిలో మొదటి రోజే ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీతో పాటు సుమారు 40 మంది మిలిటరీ కమాండర్లు చనిపోయారు. అయితే కేవలం 40 సెకన్లలోనే 40 మంది టాప్ ఇరానీ మిలిటరీ కమాండర్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం పేర్కొన్నది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ కుదిరిన నేపథ్యంలో ఐడీఎఫ్ ఓ రిపోర్టును రిలీజ్ చేసింది. 40 రోజుల వార్‌లో అనేక మంది ఇరానీ కమాండర్లను చంపినట్లు ఐడీఎఫ్ చెప్పింది. డజన్ల సంఖ్యలో సీనియర్, మీడియా రేంజ్ ఇరానీ ఆఫీసర్లను కూడా ఏరివేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొన్నది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 5 వేల మంది ఇరానీ సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. వేల సంఖ్యలో ఇరానీ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. మృతుల్లో అంతర్గత భద్రతా బలగాలు, బసిజి పారామిలిటరీ దళాలు ఉన్నట్లు తెలిసింది.ఇజ్రాయిలీ అటాక్‌లో మృతిచెందిన వారిలో ఖమేనీతో పాటు మిలిటరీ అడ్వైజర్ అలీ శామ్‌ఖానీ, ఐఆర్జీసీ కమాండ్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఐఆర్జీసీ నేవీ చీఫ్ అలీరెజా తంగసిరి, ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మసీద్ ఖాదేమి,



బసిజి పారామిలిటరీ దళ కమాండర్ గోలంరెజా సోలేమానీ, ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైని, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ హెడ్ అలీ లారిజారి, డిఫెన్స్ మినిస్టర్ అజిన్ నాసిర్‌జాద్‌ఏ, ఎస్‌ఎపీఎస్డీ చైర్మెన్ హుసేన్ జాబల్ అమేలియన్, ఖమేనీ మిలిటరీ సెక్రటరీ మొహమ్మద్ షిరాజి ఉన్నారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. అనేక ఇరానీ అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు చెప్పింది. ఇరాన్ వద్ద సుమారు 60 శాతం శుద్ధీకరించిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ యురేనియంతో దాదాపు 11 అణు బాంబులను తయారు చేయవద్దు అని ఇజ్రాయిల్ అధికారులు అంచనా వేశారు. యాజ్ద్ పట్టణం వద్ద ఉన్న న్యూక్లియర్ ప్లాంట్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అరాక్‌లో ఉన్న హెవీ వాటర్ రియాక్టర్‌పై కూడా దాడి జరిగింది. టెహ్రాన్‌లోని మలేక్ అస్తార్ యూనివర్సిటీలో ఉన్న న్యూక్లియర్ రీసర్చ్ డెవలప్మెంట్ సైట్, పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని తలేగాన్ 2 కేంద్రం, మిన్‌జాదేహి సీక్రెట్ అండర్‌గ్రౌండ్ కేంద్రంతో పాటు ఇతర అణు కేంద్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు ఆర్థిక నష్టం కలిగించే గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అటాక్ చేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది. రెండు భారీ స్టీల్ ఫ్యాక్టరీలు, అనేక పెట్రోకెమికల్ కేంద్రాలు, 10 కీలకమైన రైలు మార్గాలు, బ్రిడ్జిలను పేల్చినట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెట్రోకెమికల్ కేంద్రాల్లో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. రైలు మార్గాలు, బ్రిడ్జల ద్వారా ఆయుధాలను ఇరాన్ సరఫరా చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది.

## ఎలక్ట్రోమ్యాగ్నటిక్, బ్లాకౌట్ బాంబులను పరీక్షించిన ఉత్తర కొరియా

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** కొత్త తరహా హైటెక్ ఆయుధాలను ఉత్తర కొరియా పరీక్షించింది. ఎప్పుడూ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలతో హోరెత్తించే ఆ దేశం ఇప్పుడు తాజాగా ఎలక్ట్రోమ్యాగ్నటిక్ వెపన్స్, కార్బన్ ఫైబర్ బాంబులను పరీక్షించింది. వీటితో పాటు న్యూ మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను కూడా పరీక్షించినట్లు ఆ దేశ మీడియా పేర్కొన్నది. మూడు రోజుల పాటు ఆ పరీక్షలు జరిగినట్లు ఉత్తర కొరియా జనరల్ కిమ్ జాంగ్ సిక్ తెలిపారు. దేశ ఆయుధ బాండాగారంలో కొత్త తరహా ఆయుధాలు చేరాయని, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సిస్టమ్‌తో పాటు కార్బన్ ఫైబర్ బాంబులు ప్రత్యేక అసెట్స్ కానున్నట్లు చెప్పారు. అయితే ఈ కొత్త తరహా ఆయుధాల గురించి ఆయన ఎక్కువ సమాచారం ఇవ్వలేదు.నార్త్ కొరియా భూభాగం నుంచి అనేక



మిస్సైళ్లను లాంచ్ చేసినట్లు గుర్తించామని దక్షిణ కొరియా మిలిటరీ పేర్కొన్నది. ఆ ప్రొజెక్టైల్స్ సుమారు 240 నుంచి 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఉంటాయని పేర్కొన్నారు. బ్లాకౌట్ కార్బన్ ఫైబర్ బాంబ్లతో.. ఎలక్ట్రిక్ గ్రిడ్‌లు, పవర్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయవచ్చు. ఆ బాంబుల నుంచి విడుదలయ్యే గ్రాఫైట్ ఫిలమెంట్లు ఎలక్ట్రిక్ గ్రిడ్లలో షార్ సర్క్యూట్ అయ్యేలా చేస్తాయి. నాన్ న్యూక్లియర్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ పల్స్ వెపన్ ఓ ప్రత్యేకమైన డివైస్. దీనితో మిలిటరీ అసెట్స్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ సర్క్యూట్లను న్యూట్రలైజ్ చేయవచ్చు. రేడార్ వ్యవస్థలను, విమానాలను ఈఎంపీ వెపన్‌తో నిర్వీర్యం చేయవచ్చు. హాసాంగ్-11 అణు సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణికి కొత్త తరహా క్లస్టర్ వార్‌హెడ్‌ను అమర్చి పరీక్ష చేసినట్లు ఉత్తరకొరియా మీడియా పేర్కొన్నది.

# అమెరికాతో ఆటలొద్దు

మొదటి తరువాయి

ఆటలు ఆడాలని చూస్తే సహించబోమని వాన్స్ స్పష్టం చేశారు.ఆరు వారాలుగా క్షిపణుల మోతతో అట్టుడికిన పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించిన అమెరికా టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చలకు సిద్ధమైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉన్నత స్థాయి బృందంతో కలిసి శుక్రవారం పాకిస్థాన్ బయల్దేరారు. టెహ్రాన్‌తో చర్చల కోసం మేము సిద్ధంగా ఉన్నాం. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను అని పాకిస్థాన్‌కు వెళ్లడానికి ముందు వాన్స్ పేర్కొన్నారు.టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చల విషయమై అధ్యక్షుడు ట్రంప్ మాకు కీలకమైన సూచనలు చేశారు. ఆయన మాట ప్రకారం ఇరాన్ విశ్వసనీయతతో చర్చలు జరిపితే మేము సానుకూలంగా స్పందిస్తాం. అలా కాకుండా వారు మాతో ఆటలు ఆడాలనుకుంటే మాత్రం చర్చలకు వచ్చిన బృందం వారి మాట అస్సలు వినదు. అయితే.. మేము మాత్రం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు సానుకూలంగా జరగడానికి ప్రయత్నిస్తాం' అని వాన్స్ వెల్లడించారు. అమెరికా, టెహ్రాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా దౌత్యపరమైన చర్చలకు చాలా ప్రాధాన్యం ఉంది. వాన్స్‌తో పాటు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో కూడిన బృందం పాక్ ప్రధాని మధ్యవర్తిత్వంలో టెహ్రాన్ ప్రతినిధులుతో చర్చలు జరుపనుంది.

# బెంగాల్ ఓటర్లకు బీజేపీ తాయిలాలు

మొదటి తరువాయి

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం సంకల్ప్ పత్ర పేరిట బీజేపీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మ్యానిఫెస్టో విడుదల చేస్తూ ఇది సోనార్ బంగ్లా నిర్మాణం కోసం రోడ్డుమ్యాపుగా అభివర్ణించారు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

మొదటి తరువాయి

ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ .. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హర్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్ఫ్÷ర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వైభవ్ దెబ్బ.. ఆర్సీబీ అబ్బా

మొదటి తరువాయి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్‌కు వైభవ్ సూర్యవంశీ మెరుపు ఆరంభాన్ని అందించాడు. వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78 రన్స్), ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 రన్స్) రాణించడంతో పవర్ ప్లే ముగిసే సరికి 97/1తో నిలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. వైభవ్ సూర్యవంశీ పవర్ ప్లే ముగిసే సరికే 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి.. ఆర్సీబీ నుంచి మ్యాచ్ లాగేశాడు.వైభవ్ ఔట్ అయిన కాసేపటికే హిట్‌మెయర్ (0), రియాన్ పరాగ్ (3) పెవిలియన్ చేరినా.. రవీంద్ర జడేజా సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. జురెల్‌తో కలిసి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 50 బంతుల్లో 68 రన్స్ జోడించాడు. 25 బంతుల్లో 24 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచులో ఆర్ఆర్ 4 వికెట్లు కోల్పోయి 18 ఓవర్లలో మ్యాచ్ ముగించింది. టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. ఓ దశలో 2.5 ఓవర్లలో 45/1తో భారీ స్కోరుపై కన్నేసింది. ఆ తర్వాత 94/6, 125/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ చివర్లో కెప్టెన్ రజత్ పటీదార్ (40 బంతుల్లో 63 రన్స్), ఇంపాక్ట్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ (15 బంతుల్లో 29 రన్స్) సత్తాచాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 రన్స్ స్కోరు చేసింది.

## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత



కోల్‌కతా,ఏప్రిల్ 10

ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షితను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

# యువత సవాళ్లను స్వీకరించాలి

మొదటి తరువాయి

భవిష్యత్తు నాయకులుగా మారే ప్రత్యేక క్షణంగా చూడాలని కోరారు. తర్వాత ఏమిటి?(వాట్ నెక్ట్స్), ఎందుకు కాదు?(వై నాట్) అని ప్రశ్నించే తరమే నేటి ప్రపంచానికి అవసరమని తెలిపారు. విశాఖ అభివృద్ధిలోనూ సత్వా గ్రూప్ భాగస్వామ్యం కాబోతోందని చెప్పారు. షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే అన్నింటి కన్నా గొప్ప బలమని పేర్కొన్నారు. 'యువగళం' తనలో ఎన్నో మార్పులకు కారణమైందన్నారు. అప్పటి వరకు పాలనను వ్యవస్థ దృష్టితో చూసిన తనకు ఆ పాదయాత్ర తర్వాత ప్రజల దృష్టితో చూడటం అలవాటైందని లోకేశ్ వివరించారు. సత్వా గ్రూప్ ఎండీ, గ్రీన్ ఉడ్‌హై ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ బిజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# 'దీపం' లబ్ధిదారులకూ పీఎన్‌జీ

మొదటి తరువాయి




ఈ నేపథ్యంలో పీఎన్‌జీకి కూడా దీపం–2 సబ్సిడీని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఎల్పీజీ వినియోగదారులను పెద్దఎత్తున పీఎన్‌జీకి మార్చాలనే లక్ష్యంతో 'ఆంధ్రప్రదేశ్ పీఎన్‌జీ సబ్వెన్షన్ స్కీం' అమలుకు ఆమోదం తెలుపుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్కీం కింద పీఎన్‌జీ కనెక్షన్ తీసుకునే దీపం–2 లబ్ధిదారులకు సంవత్సరానికి రూ. 2,400 సబ్సిడీ వర్తిస్తుంది. అయితే దీపం పథకం కింద ప్రస్తుతం ఉన్న ఎల్పీజీ కనెక్షన్‌ను తిరిగి ఇచ్చిన తర్వాతనే లబ్ధిదారులకు పీఎన్‌జీ సబ్సిడీ లభిస్తుంది.

**లక్ష్యాలనుచేరుకోవాలి: సీఎం**

యుద్ధం కారణంగా ఎల్పీజీ సరఫరాలో తలెత్తిన సమస్యలనుఎదుర్కొనేందుకు మరిం త సమర్థంగా పని చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. రాష్ట్రంలో పీఎన్‌జీ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై శుక్రవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. దీపం లబ్ధిదారులకు పీఎన్‌జీ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అ?ధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్‌జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం–కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో ఆలస్యంపై అధికారులను వివరణ కోరారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో.. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్?దీపసింగ్ పూరికి ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# వివాదంలో మోనాలిసా పెళ్లి

**-పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు**
**-భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**



**లక్నో,**

కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు.ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# 9,436 కోట్ల ప్రతిపాదనలకు ఓకే

మొదటి తరువాయి



జరిగిన మంత్రిమండలి సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. ఆ నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసార?థి మీడియాకు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎ?సఐపీబీ) 260 ప్రాజెక్టులను ఆమోదించగా, వీటి ద్వారా కొత్తగా 9.62 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయని మంత్రి తెలిపారు. డీఎస్సీ టీచర్ పోస్టులు, పోలీస్ ఉద్యోగాలతో పాటు జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చే ఉద్యోగాలకు ఇవి అదనమన్నారు. ఉద్యోగ కల్పనకు సంబంధించిన జోన్ల విధానంలో మార్పులు చేసినట్టు మంత్రి తెలిపారు. "గతంలో జోన్1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉండేవి. ఇప్పుడు మారిన జోన్ ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి ఉంటాయి. జోన్2లో తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలు గతంలో ఉన్నాయి. వాటి బదులు అల్లూరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలను చేర్చాం. జోన్3లో గతంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉన్నాయి. వాటి బదులు పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలుంటాయి. జోన్4లో రాయలసీమ ఉమ్మడి జిల్లాల ఉండేవి. ఇప్పుడు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను చేర్చాం. జోన్5లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, జోన్6లో నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను చేర్చాం" అని మంత్రి వివరించారు. వచ్చే నెల 15న నెల్లూరు జిల్లాలో డిఫెన్స్ రా మెటీరియల్ ప్లాంట్ నిర్మాణానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ద్వారా వర్చువల్‌గా శంకుస్థాపన చేయించే అవకాశం ఉందని తెలిపారు.

# 20న బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

మొదటి తరువాయి

వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈనెల 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. 'మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే తనను పంపాడు.. తిరోగమనంలో ఉన్న కాంగ్రెస్‌పై యుద్ధం చేయాలి' అంటూ ఎమోషన్ అయినట్టు సమాచారం. కాగా కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. కేటీఆర్ ఆయనతో చర్చలు జరిపారు. గురువారం స్వయంగా జగిత్యాలకు వెళ్లి భేటీ అయ్యారు. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమాలకర్, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కె.విద్యాసాగర్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ జిల్లా చైర్మన్ వసంత తదితరులున్నారు.

# టోల్ ప్లాజాల వద్ద ఇక నో క్యాష్ పేమెంట్స్

## అమల్లోకి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ

జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద టోల్ రుసుమును శుక్రవారం నుంచి నగదు రూపంలో చెల్లించే అవకాశం లేదని కేంద్ర రోడ్డు రవాణా శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది.డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం లేని వాహనదారులకు ఇది ఇబ్బందికరమైనా.. టోల్ గేట్ల వద్ద భారీ వరుసలను తగ్గించి ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఈ కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. మరోవైపు ఫాస్టాగ్‌తో కాకుండా యూపీఐతో చెల్లింపులు జరిపితే 1.25 రెట్లు ఎక్కువగా టోల్ చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్ తెలిపింది. ఈ నెల 1న ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను ఎన్‌హెచ్ఏఐ 2.5 శాతం పెంచడంతో దాని ధర రూ.3,075కు చేరుకొన్నది.

# పొటాటో రోజు తింటే ఆరోగ్యకరమైనా?!



**ఇంటర్నెట్‌డెస్క్ :**

పొటాటో అంటే ఎవరికిష్టం ఉండదు చెప్పండి. మరీ ముఖ్యంగా చిన్నపిల్లలకి పొటాటోతో చేసిన ఏ వంటకమైనా ఎంతో ఇష్టంగా తింటారు. ఇక పెద్దవాళ్లు కూడా పొటాటో సలాడ్, ఫ్రెంచ్ ఫ్రైస్ ఇలాంటి రకరకాల వంటకాలతో దీన్ని రోజూ తింటూనే ఉంటారు. ఇలా బంగాళదుంపని రోజూ తింటే ఆరోగ్యానికి మంచిదా? కాదా? లేదా ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తాయా? అని తెలుసుకోవాలనుందా? దీనికి వైద్యులు ఏం సూచిస్తున్నారంటే...?!

- పొటాటోలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అలాగే ఐరన్, విటమిన్ సి, విటమిన్ బి6లు కూడా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయి.

-- బంగాళదుంపల్ని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని తినడం కన్నా.. వాటిని ఉడకబెట్టుకుని తింటే ఆరోగ్యానికి మంచిదని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. నూనెలో వేయించిన పొటాటోని తీసుకుంటే శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

- మీకు నీరసంగా ఉన్నప్పుడు ఉడకబెట్టిన బంగాళదుంపల్ని తీసుకుంటే తక్షణమే శక్తి వస్తుంది. ముఖ్యంగా పొటాటో మెదడు, ఎముకల ఆరోగ్యానికి ఎంతోమంచిది.

- ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న బంగాళదుంపల్ని మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకే వాటిని తీసుకోవాలి.

# ఇసుక దొందులు ఇలా వండి తింటే ఆరోగ్యానికి ఆర్గానిక్ మందులు లెక్క..



**కావాల్సిన పదార్థాలు**

:అర కిలో ఇసుక దొందులు చేపలు, రెండు ఉల్లిపాయలు, రెండు టమోటాలు, నాలుగు పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, ఒక టేబుల్ స్పూన్ కారం , అర టేబుల్ స్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, అర టేబుల్ స్పూన్ గరం మసాలా, చింతపండు రసం , నూనె , కరివేపాకు, కొత్తిమీరను తీసుకోవాలి.ముందుగా చేపలను తీసుకుని ఒకటికి రెండు సార్లు బాగా కడిగి, దానిలో ఉప్పు , పసుపు వేసి పది నిముషాల పాటు అలాగే ఉంచాలి. ఇప్పుడు పాన్ లో ఆయిల్ వేసి అది వేడయ్యాక కరివేపాకు, పచ్చిమిర్చి కూడా వేయండి.ఇప్పుడు కట్ చేసిన ఉల్లిపాయలు వేసి బంగారు కలర్లోకి మారే వరకు బాగా వేయించుకోవాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వాసన పోయే వరకు వేయించాలి. ఇంకా టమోటాలు కూడా వేసి బాగా ఉడికించుకోవాలి.ఒక టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి వేసి కలపండి. ఆ తర్వాత చింతపండు రసం వేసి బాగా ఉడికించుకోవాలి.గ్రేవీగా అయినా తర్వాత ఇసుక దొందులు చేపలు వేసి స్లోగా కలపాలి. ఆ తర్వాత మూత పెట్టి 10 నుంచి 15 నిమిషాల మధ్య సన్నని మంటపై ఉడికించండి. చివర్లో మసాలా పొడి , కొత్తిమీరను వేసి స్టవ్ మీద నుంచి కిందకు దించేయండి.

# ఎండ దెబ్బకు చెక్..

### కొబ్బరి నీళ్లలో ఈ గింజలు వేసుకుని తాగితే అమృతమే.. ఊహించని లాభాలు..



భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి తీవ్రత పెరగడంతో అధిక చెమట, తీవ్రమైన అలసట, నీరసం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి నీరు, చలువ చేసే సబ్జా గింజల మిశ్రమంతో ఈ సమస్యలకు సులువుగా చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.డీహైడ్రేషన్‌కు అద్భుత పరిష్కారం: ఎండల వల్ల శరీరంలోని ఎలక్ట్రోలైట్లు వేగంగా తగ్గిపోతాయి. కొబ్బరి నీటిలో ఉండే పొటాషియం, సోడియం, మెగ్నీషియం శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. వీటికి సబ్జా గింజలను జత చేస్తే, అవి నీటిని పీల్చుకుని జెల్ లాగా మారి, శరీరంలో ఎక్కువ సేపు తేమను నిలుపుతాయి. తద్వారా అలసట మాయమై, శరీరం రీఛార్జ్ అవుతుంది.జీర్ణక్రియకు రక్షణ కవచం: వేసవిలో వచ్చే గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు ఈ పానీయం ఒక దివ్యౌషధం. సబ్జా గింజల్లో ఉండే అధిక పీచుపదార్థం పేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొబ్బరి నీరు కడుపులోని మంటను తగ్గించి, ఎసిడిటీని నియంత్రణలో ఉంచుతుందిబరువు తగ్గాలనుకునే వారికి వరం: ఊబకాయం లేదా అధిక బరువుతో బాధపడేవారికి ఇది ఉత్తమ ఎంపిక. సబ్జా గింజలు తీసుకున్నప్పుడు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి, దీనివల్ల అతిగా తినే అలవాటు తగ్గుతుంది. కొబ్బరి నీటిలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉండదు.చర్మ సౌందర్యం.. రెట్టింపు శక్తి: ఈ మిశ్రమం కేవలం ఆరోగ్యానికే కాదు చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడం ద్వారా చర్మం కాంతివంతంగా మారుతుంది. మధ్యాహ్న సమయంలో ఈ పానీయం తీసుకోవడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాబట్టి కూల్ డ్రింక్స్, సోడాల వంటి కృత్రిమ పానీయాల కంటే.. సహజసిద్ధమైన ఈ కొబ్బరి నీరు-సబ్జా గింజల మిశ్రమాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు.

# అయ్యయ్యో.. పుచ్చకాయ తింటూ పొరబాటున గింజలు మింగేశారా?

## మీ పొట్టలో జరిగేదిదే..

వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఐరన్ కూడా పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయలో కేలరీల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల మధుమేహ రోగులు కూడా పుచ్చకాయ హాయిగా తినవచ్చు. కాబట్టి ఎండ వేడిమికి చర్మం కమిలిపోకుండా ఉండాలంటే తియ్యని పుచ్చకాయ ముక్కలు తినాల్సిందే. ఫలితంగా మీ శరీరం ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. పుచ్చకాయ మాత్రమే కాదు పుచ్చకాయ గింజలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి.చాలా మంది పుచ్చకాయ తినేటప్పుడు పొరపాటున గింజలను మింగేస్తుంటారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. నిజానికి ఇది పొరపాటు కాదని నిపుణులు చెబుతున్నారు. పైగా పుచ్చకాయ గింజలను నేరుగా కూడా తినవచ్చు.

**పుచ్చకాయ గింజలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు**

పుచ్చకాయ గింజలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా పుచ్చకాయ గింజలు ఆహారం త్వరగా జీర్ణం కావడానికి కూడా సహాయపడతాయి. చర్మంపై ముడతలను తగ్గించడానికి లేదా చర్మపు కాంతిని పెంచడానికి పుచ్చకాయ గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. పుచ్చకాయ ముక్కలుగా కట్ చేసి, దాని గింజలను వేరు చేయాలి. ఆ తర్వాత దానిని ఎండలో ఆరబెట్టి, పొడి పెనంలో వేయించాలి. ఈ గింజలను నేరుగా నమిలి తినవచ్చు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లేదా భోజనం తర్వాత తినవచ్చు. బరువు తగ్గాలనుకునేవారు మధ్యాహ్నం పూట చిరుతిండిగా పుచ్చకాయ గింజలను తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఆకలి తక్కువగా అనిపించి, వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే అన్నంతో పాటు పుచ్చకాయ గింజలను కూడా తినవచ్చు. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.



# న్యాయశాఖ పటిష్టత కోసం చర్యలు

## పబ్లిక్ లిటిగేషన్ పాలసీ-పై మంత్రి వర్గ ఉపసంఘం భేటి



**అమరావతి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ధ చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖ లోతప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం,పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు.ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం,లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్య కుమార్ లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి పరీక్ష

**-ప్రిన్సిపాల్ అశోక్ నాయక్**




ఆదర్శ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం :** మండల పరిధిలోని రచ్చుమర్రి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2026, 2027 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి, ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రచ్చుమర్రి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు. ఏప్రిల్ 12 వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 112 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని,విద్యార్థులు వచ్చేటప్పుడు పరీక్షకు అవసరమైన పెన్నులు,ప్యాడు, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు.

# తనకల్లులో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సదస్సు



**తనకల్లు, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్ న్యూస్.** స్థానిక తనకల్లు-5వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'పోషణ పఖ్వాడా' కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులకు, గర్భిణులకు ఆరోగ్య సూత్రాలపై పలు సూచనలు చేశారు.

**కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:**

**ఆసుపత్రి కాన్పుల ప్రాముఖ్యత:** గర్భిణులు విధిగా ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలని, టీకాలు సకాలంలో తీసుకోవాలని సూచించారు.

**శిశు ఆరోగ్యం:** తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, శిశువుకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

అంగన్‌వాడీ ద్వారా అందే పౌష్టికాహారం ప్రాముఖ్యతను, బాలింతలు ఎటువంటి ఆహారం తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, డీహైడ్రేషన్ వల్ల కలిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కి కృతజ్ఞతలు జనసేన నాయకులు మాదాసు నరసింహ

**-చిట్వేలి బస్టాండ్ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీధర్ చొరవ**
**- సొంత వేతనంతో పనులకు శ్రీకారం**




**చిట్వేలి ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** మండల కేంద్రమైన చిట్వేలి ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చొరవ చూపారు. గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు, చిట్వేలు హెల్ప్‌లైన్ సొసైటీ సభ్యులు బస్టాండ్ దుస్థితిని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్రీధర్, సమావేశం అనంతరం బస్టాండ్ ప్రాంగణాన్ని స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఆ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, కంపచెట్లు, అపరిశుభ్ర వాతావరణం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించిన ఆయన, తన ఒక నెల వేతనాన్ని ఈ పనుల కోసం వినియోగిస్తానని అక్కడికక్కడే ప్రకటించడం విశేషం. ఎమ్మెల్యే నిర్ణయంతో వెంటనే శుభ్రత మరియు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చిట్వేలు మండల జనసేన నాయకులు మాదాసు నరసింహతో పాటు జనసైనికులు ఎన్డీఏ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన బస్టాండ్‌ను అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం ప్రశంసనీయమని కొనియాడారు. స్థానిక ప్రజలు కూడా ఎమ్మెల్యే శ్రీధర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, బస్టాండ్ రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం



**చిట్వేల్, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** బీసీ హక్కుల సాధన కోసం బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఈ నెల 11వ తేదీన విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చోనున్నారని పార్టీ నాయకులు తెలిపారు. బీసీలకు సంబంధించిన ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు పలుమార్లు ఉంచినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పార్టీ నాయకుడు సల్లకంచు రామకృష్ణ యాదవ్ వెల్లడిస్తూ, బీసీల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఈ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు మద్దతుగా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి దాదాపు 50 నుండి 80 మంది వరకు నాయకులు, కార్యకర్తలు విజయవాడకు బయలుదేరుతున్నారని చెప్పారు. బీసీల హక్కుల సాధనలో భాగంగా ఈ కార్యక్రమానికి విస్తృత స్థాయిలో సంఘీభావం వ్యక్తం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఇక మహేష్, సందీప్, ప్రేమ్ తదితర నాయకులు కూడా ఈ దీక్షకు మద్దతుగా పలు వాహనాల్లో కార్యకర్తలను సమీకరించి విజయవాడకు తరలిస్తున్నట్లు తెలిపారు. బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం అందరూ ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు.

# గ్యాస్ సరఫరా సజావుగా ఆందోళన అవసరం లేదు

**గృహ అవసరాలకే ప్రాధాన్యం - అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేయాలి**



**బాపట్ల ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** జిల్లాలో వంట గ్యాస్ సరఫరా సక్రమంగా కొనసాగుతోందని, ఎలాంటి కొరత లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్. జమీర్ బాషా తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా సాధారణంగా గ్యాస్ వినియోగాన్ని కొనసాగించాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో 6096 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, గృహ అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుల మొబైల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా మాత్రమే పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.పట్టణాల్లో 25 రోజుల వ్యవధిలో, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిలో బుకింగ్ విధానం అమల్లో ఉందని చెప్పారు. డెలివరీ సిబ్బంది ఎవరైనా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లయితే వెంటనే 94932 47765 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.


# పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు

## వార్డు సభ్యులకు ఘన సన్మానం



**చిట్వేలి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యంగా నిలిచిన వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, అధికారులకు చిట్వేలి మాజీ సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5వ ఆర్థిక సంఘం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ చిట్వేలి పట్టణంలో సుమారు 1600 మీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. సింగనమల వీధిలోని పంచాయతీ స్థలం ఆక్రమణకు గురికాకుండా ముందస్తు చర్యగా బేస్మెంట్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించినట్లు తెలిపారు. మండలంలోనే ప్రత్యేకంగా నిలిచే విధంగా హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియల అనంతరం కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న ఎకరా స్థలాన్ని కబ్జా కాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో నస్రీన్ బేగం, స్వర్ణ గ్రామం డిప్యూటీ ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణయ్యతో పాటు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా చౌడేశ్వరి దేవి పల్లకి సేవ మహోత్సవం



**బనగానపల్లె, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు . శుక్రవారం మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు .భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు

# గుబగుండం మెట్ట వద్ద ప్రమాదం



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:** నంద్యాల వైపు నుంచి కడప వైపు వెళు ్న్న కారు ఆళ్లగడ్డ మండలం గుబగుండం మెట్ట వద్ద అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో ఒకరికి కాలు విరగగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# బాలల ఆరోగ్యమే తల్లులకు అవగాహన సదస్సు.



**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)**
మండలం పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలోని 1వఅంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్న పిల్లల మెదడు అభివృద్ధి కోసం సరైన పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో అవసరమని వివరించారు.ప్రత్యేకంగా చిన్నారులలో స్ర్కీన్ టైమ్‌ను నియంత్రించాల్సిన అవసరాన్ని వివరించి, మొబైల్ ఫోన్లు, టీవీ వినియోగం అధికమైతే పిల్లల మానసిక, శారీరక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. అలాగే ప్యాక్ చేసిన ఆహార పదార్థాల వలన కలిగే అనారోగ్య సమస్యలపై తల్లులకు అవగాహన కల్పించారు.స్థానికంగా లభించే సాంప్రదాయ ఆహారం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, బాలల ఉజ్వల భవిష్యత్తు కోసం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఎంచుకోవాలని సూచించారు. “మన బాలల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన ఆహారం ఎంపిక చేసుకుందాం” అనే నినాదంతో కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు వి. హైమావతి, బుజ్జమ్మ, ఆయాలు అనసూయ, లక్ష్మీదేవి మరియు తల్లులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాలు సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీలు



**శిరివెళ్ళ ( డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలలో సచివాలయాలలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తికేయ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తానికిలు చేశారు. తహసిల్దార్ ఐ విజయశ్రీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర కుమార్ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాలలోని ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రైస్ మరియు సుగర్ ఇతర చౌక దుకాణంలోని సరుకుల వివరాల గురించి డీలర్లను అడిగి తెలుసుకున్నారు క్రమం తప్పకుండా సమయానుకూలంగా సరుకుల పంపిణీ వేస్తున్నారా లేదా అని రేషన్ కార్డు దారులతో ఆరా తీశారు.కొన్ని రేషన్ దుకాణాలలో కేవలం బియ్యం మాత్రమే నిల్వ ఉండడం చెక్కర లేకపోవడం పట్ల రేషన్ డీలర్ల పై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలోని సిబ్బంది ఉద్యోగులు విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు వ్యసనాలకు ఆవు లేకుండా సక్రమంగా పౌర సేవలు అందించాలని ఆదేశించారు. శిరివెళ్లలో కొనసాగుతున్న భూ సర్వే రికార్డులను పరిశీలించి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రిసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఆయిల్ ఫామ్ రైతులకు సిరులు కురిపించే పంట



**బనగానపల్లె, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
ఆయిల్ ఫామ్ రైతులకు సిరులు కురిపించే పంట అని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి యు. నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో ఆయిల్ ఫామ్ తోటలను జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు పరిశీలించారు. రైతులకు పంటపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట సాగు చేసే రైతులకు ఉద్యానవన శాఖ 100% రాయితో మొక్కలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మొక్కలు ఉష్ణోగ్రతను తట్టుకునే రకాలు పతాంజలి, తుమ్మల, నవభారత్ ను కంపెనీలు జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. ఒక హెక్టారుకు 125 మొక్కలు పడతాయని, 9 మీటర్లు పొడవు వెడల్పుతో దూరంలో నాటాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులకు నాలుగు సంవత్సరాల పాటు 42 వేల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ లో అంతర్ పంటల సేద్యానికి ఖర్చులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల నుండి 8 నుంచి పది స్థానాల దిగుబడి వస్తుందని తెలిపారు. ఒక టన్ను ధర ప్రస్తుతం 22,000 ఉందని, నికర ఆదాయం లక్షన్నర వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ పంటతో పాటు ఐదు సంవత్సరాల వరకు అంతర్ పంటలను గట్ల చుట్టూ వెదురు మొక్కలను నాటుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకులు శ్రీధర్, రైతు రామేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సీ రిజర్వేషన్లు వాడుకుంటూ మతమార్పిడులా

-“మండ్లిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మత ప్రచారం?
-ఉపాధ్యాయుడి అక్రమాలపై మండల ప్రజల ఆగ్రహం!”
-విదేశీ నిధులతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నాడని టీచర్‌పై మండలంలో గుసగుసలు.
-“నియమాలు ఉల్లంఘిస్తున్న ఉపాధ్యాయుడికి అధికారుల కొమ్ముకాస్తుండటం పై వెల్లువెత్తుతున్న విమర్శలు.”
-తనకల్లు మండలం మండ్లిపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడి అక్రమ మత మార్పిడులు, విదేశీ నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్.


**తనకల్లు ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తనకల్లు మండలంలోని మండ్లిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్ జి టి గణేష్ తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మత మార్పిడికి పాల్పడటమే కాకుండా, విదేశీ నిధులతో అక్రమంగా ఆస్తులు గడించారనే ఆరోపణలు మండలంలో సంచలనంగా మారాయి. సుండు పల్లి ?గణేష్ అనే ఉపాధ్యాయుడు హిందూ ఎస్సీ (మాల) కేటగిరీలో ప్రభుత్వ ఉద్యోగం పొంది, ఆ తర్వాత క్రైస్తవ మతంలోకి మారారని, దాదాపు పది సంవత్సరములకు పైగా క్రైస్తవ మతంలో కొనసాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మత మార్పిడి జరిగిన తర్వాత రిజర్వేషన్ ఫలాలను అనుభవించడం చట్టరీత్యా నేరమని తెలిసినా, ఆయన ఇప్పటికీ రికార్డుల్లో అక్రమంగా కొనసాగుతున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మత మార్పిడికి అన్ని విధాలుగా



ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ విదేశాల నుండి నిధులు సేకరించడం, ఆ సొమ్ముతో భారీ భవనాలు నిర్మించుకోవడం, విలాసవంతమైన కార్లలో తిరుగుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.ప్రభుత్వ సేవా నిబంధనలను తుంగలో తొక్కడమే కాకుండా, అక్రమ సంపాదనతో అధికారాన్ని చలాయిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, అధికార యంత్రాంగం సదరు ఉపాధ్యాయుడికి అండగా నిలవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు కమిటీ వేయాలని భావిస్తున్నా, స్థానిక అధికారులు మాత్రం ఆయనపై ఎటువంటి ఆరోపణలు లేనట్లుగా వెనకేసుకొస్తున్నారని సమాచారం. దీని వెనుక భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ మత ప్రచారానికి పాల్పడుతున్న గణేష్‌పై సమగ్ర విచారణ జరిపించాలని, ఆయన ఆదాయ వనరులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, 1950 రాజ్యాంగ ఉత్తర్వుల (షెడ్యూల్డ్ కులాలు) ప్రకారం, హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలు కాకుండా వేరే మతాన్ని అనుసరించే వ్యక్తి ఎస్సీ రిజర్వేషన్‌కు అనర్హులు. హిందూ-మాల లేదా మాదిగ కులాలకు చెందిన వారు క్రైస్తవ మతంలోకి మారితే వారిని బీసీ-సి గా పరిగణించాలని ప్రభుత్వ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ఎ పి సి ఎస్ సిసిఏ రూల్స్ 1991 ప్రకారం, నిజానిజాలను దాచిపెట్టి తప్పుడు కుల ధృవీకరణ పత్రంతో ప్రయోజనాలు పొందడం “తీవ్రమైన దుష్ప్రవర్తన కిందకు వస్తుంది. కావున అధికారులు వెంటనే విచారణ చేపట్టి సదరు ఉపాధ్యాయుడి కుల ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలి. నిబంధనల ప్రకారం అతడిని తక్షణమే సర్వీసు నుండి తొలగించి చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరో ఏడాది (2026-27)పొడిగింపు

**అమరావతి, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం(జుస్రూ) మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం




లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్(జీస్రూ)ను ప్రవేశపెట్టడం జరిగింది.దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది.మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# రైతులను ముప్పు తిప్పలు పెడితే తగిన చర్యలు తప్పవు జెసి

**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)**
సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు రైతు వారి పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసే మ్యుటేషన్ విషయంలో రైతులను ముప్పు తిప్పలు పెడుతూ తిరస్కరిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తికేయ ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల కేంద్రంలోని మూడవ సచివాలయాన్ని శుక్రవారం సాయంత్రం జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. విస్తీర్ణం, రైతుల పేర్లు సర్వే నెంబర్ల వివరాలు సరిపోలేదని రైతుల యొక్క పట్టాదార్ పాస్ పుస్తకాల అర్జీలను తిరస్కరించడం వంటి సమస్యలు జిల్లా కేంద్రంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి



వస్తున్నాయని అన్నారు. అర్జీలను తిరస్కరించే అధికారం డిజిటల్ అసిస్టెంట్లకు ఎక్కడిదని ఘాటుగా హెచ్చరించారు. తాసిల్దార్ లాగిన్ లో విస్తీర్ణం సబ్ డివిజన్ సర్వే నెంబర్లు రైతుల పేర్లు వంటి వివరాలు ఏవైనా ఉంటే తిరస్కరించడం సబ్మిట్ చేసి ఓకే చేయడం వంటి చర్యలు చేపడతారని ఆదిలోనే హంసపాదుల డిజిటల్ అసిస్టెంట్లు రైతులను ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని జెసి హెచ్చరించారు. రేషన్ దుకాణాల్లో ప్రతీ కార్డుదారునికి ప్రభుత్వ పౌరసరఫరా సరుకులు అందాలని బియ్యం ఇవ్వడం చక్కెర లేదని చెప్పడం ఇతర సరుకులకు డిడి చెల్లించకపోవడం వంటి పద్ధతులు మానుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గాటుగా హెచ్చరించారు. జెసి వెంట తహసిల్దార్ ఐ విజయశ్రీ ఆర్ ఐ రాఘవేంద్ర కుమార్ వీఆర్వో డి ప్రసాద్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదానం

**కర్నూలు, ఏప్రిల్ 10 డ్రీమ్ టైమ్స్:**
మే 20న జూనియర్ ఎన్టీఆర్ 43వ పుట్టిన రోజు ఉండడంతో ఆయన అభిమానులు జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కర్నూలు లో రక్తదాన కార్యక్రమం చేశారు. ప్రతి రోజు రాష్ట్రంలోని ఒక్కో జిల్లాలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు సురేష్ గౌడ్



తెలిపారు. సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిభిరాన్ని రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. గోవింద రెడ్డి ప్రారంభించారు. అందులో భాగంగా కర్నూలు రెడ్ క్రాస్ సోసైటీ మరియు మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మరియు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు ఈ రక్తదాన శిభిరం లో పాల్గొన్నారు.

# బిజినెస్

## మళ్లీ లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు.. 918 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్



ఒకరోజు విరామానికి తెరదించుతూ దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ లాభాల బాటపట్టాయి. పశ్చిమాసియా లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నప్పటికీ.. దేశీయంగా కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 918.6 పాయింట్లు పెరిగి 77,550.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 275.5 పాయింట్లు లాభపడి 24,050.6 వద్ద ముగిసింది.ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 77,622.50, నిఫ్టీ 24,074.05 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలను తాకాయి. ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి హెవీ వెయిట్ షేర్లు లాభపడటం సూచీల పెరుగుదలకు దోహదపడింది. బెంచ్‌మార్క్ సూచీలను మించి బ్రాడర్ మార్కెట్లు రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.48 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.67 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే మిశ్రమ ప్రదర్శన కనబరిచాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో నిఫ్టీ ఐటీ సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మరోవైపు నిఫ్టీ ఆటో, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు మిగిలిన వాటితో పోలిస్తే వెనుకబడ్డాయి. ఉదయం సెషన్ ప్రారంభంలో కూడా ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు లాభాలతోనే మొదలయ్యాయి.

## ఆకాశాన్నంటుతున్న బంగారం,వెండి ధరలు



బంగారం ధరలు మళ్లీ చుక్కలు చూపిస్తున్నాయి. గత కొంత కాలంగా సైలెంట్ గా ఉన్న ధరలు మళ్లీ పైకి ఎగబాకుతున్నాయి. ఏప్రిల్ 10 శుక్రవారం బంగారం వెండి ధరలు మళ్లీ పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,520 పెరిగి రూ.1,53,000 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,400 పెరిగి రూ.1,40,250 పలుకుతోంది. వెండిధర కేజీకి రూ.5,000 పెరిగి రూ.2,65,000 చేరింది. దేశంలోని వివధ నగరాల్లో ఏప్రిల్ 10 శుక్రవారం బంగారం వెండిధరలను పరిశీలిస్తే.. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,150 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ.1,40,400 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,53,000 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,250 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,090 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం రూ.1,41,250 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,000 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,250 లు పలుకుతోంది. వెండి ధర కిలోకి రూ.2,65,000 గా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ బైకు.. ప్రారంభ ధర రూ.2.79 లక్షలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:**
ప్రముఖ స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్..దేశీయ మార్కెట్లోకి తన తొలి ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫ్లైయింగ్ పీ సీ6 పేరుతో విడుదల చేసిన ఈ బైకు ప్రారంభ ధర రూ.2.79 లక్షలుగా నిర్ణయించింది. కానీ, బ్యాటరీ-యాస్-ఏ-సర్వీసెస్(బాస్) పద్ధతిన తీసుకుంటే ఈ మోటర్‌సైకిల్ ధర మాత్రం రూ.1.99 లక్షలు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ స్పోర్ట్స్ బైకును విడుదల చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.3.91 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ బైకు బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 154 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 3.7 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 115 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 65 నిమిషాల్లోనే బ్యాటరీ 20 శాతం నుంచి 80 శాతం రీచార్జికానున్నది. ఈ బైకులో ఎల్‌ఈడీ లైటింగ్, గూగుల్ ఆధారంగా పనిచేసే నావిగేషన్, వైర్‌లెస్ ఫోన్ చార్జింగ్ సాకెట్, ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

# స్పోర్ట్స్


## ధోనినే నా రోల్ మోడల్'..

### ముకుల్ చౌదరి కీలక వ్యాఖ్యలు




ఐపీఎల్ అంటేనే అనామక ఆటగాళ్లను రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చే వేదిక. 2026 సీజన్‌లో అటువంటి ఒక అద్భుత సంచలనం నమోదైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బౌలర్లను ఉతికి ఆరేసిన ముకుల్ చౌదరి ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యాడు. కేవలం 27 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీతో లక్నో సూపర్ జెయింట్స్ కి అద్భుత విజయాన్ని అందించిన ఈ కుర్రాడి వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. ముకుల్ చౌదరి రాజస్థాన్‌లోని ఒక సాధారణ సైనిక కుటుంబం నుండి వచ్చాడు. అతని తండ్రి భారత సైన్యంలో జవాన్‌గా దేశ సేవ చేశారు. "పోరాటం నా రక్తంలోనే ఉంది" అని ముకుల్ గర్వంగా చెబుతుంటాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన ముకుల్, తన తండ్రి నుండి మొండి పట్టుదలను నేర్చుకున్నాడు. మైదానంలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా పోరాడే గుణం అతనికి తన తండ్రి వల్లే వచ్చిందని మ్యాచ్ అనంతరం ముకుల్ భావోద్వేగంతో వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ముకుల్ క్రీజులోకి వచ్చాడు. సునీల్ నరైన్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కోవడం ఏమాత్రం సులభం కాదు. కానీ ముకుల్ ఏమాత్రం బెదరకుండా తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మైదానం నలుమూలలా సిక్సర్ల వర్షం కురిపించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతను ఆడిన తీరు చూస్తుంటే ఒక అనుభవం ఉన్న ఫినిషర్ ఆడుతున్నట్లుగా అనిపించింది. ముకుల్ చౌదరి ఎంఎస్ ధోనీకి వీరాభిమాని. "నేను చిన్నప్పటి నుండి ధోనీ భాయ్‌ని చూస్తూ పెరిగాను. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి ఎలా ముగించాలో ఆయనను చూసే నేర్చుకున్నాను. నా బ్యాటింగ్ స్టైల్‌లో కూడా ఆయన ప్రభావం ఉంటుంది" అని ముకుల్ పేర్కొన్నాడు. లక్నో జట్టు డైరెక్టర్ టామ్ మూడీ కూడా ముకుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకుంటూ.. అతను జట్టుకు దొరికిన అసలైన ఆణిముత్యం అని కొనియాడారు. ముకుల్ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రాజస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో నిలదొక్కుకోవడానికి అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కనీసం బ్యాట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన రోజులు ఉన్నాయని అతను గుర్తు చేసుకున్నాడు. అయితే తన ప్రతిభను గుర్తించిన లక్నో స్కౌట్స్, అతనికి ట్రయల్స్‌లో అవకాశం ఇచ్చారు. అక్కడ తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో మెప్పించిన ముకుల్, ఇప్పుడు ఐపీఎల్ వేదికపై తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టుకు ఇతను ఒక ప్రధాన అస్త్రంగా మారాడు. తన తండ్రి సరిహద్దులో దేశాన్ని రక్షిస్తే, తాను మైదానంలో పరుగుల వర్షం కురిపించి తండ్రి పేరు నిలబెడుతున్నానని ముకుల్ చెప్పిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. మరిన్ని మ్యాచుల్లో ముకుల్ ఇలాగే రాణించి భారత జట్టులోకి రావాలని ఆశిద్దాం.

## తమ్ముడికి హ్యాండిచ్చిన సారా టెండూల్కర్..



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయ సారా టెండూల్కర్ లక్నోలో సందడి చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ కోసం ఆమె లక్నోకు వచ్చినట్లు తెలుస్తోంది. లక్నో ఎయిర్‌పోర్ట్‌లో సారా టెండూల్కర్‌ను చూసిన మీడియా ప్రతినిధులు.. ఎవరికి సపోర్ట్ చేస్తారంటూ ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ టైటాన్స్ జట్టుకా..? లేక తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ ప్రాతినిథ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు మద్దతు తెలుపుతారా? అని ప్రశ్నించారు. సారా టెండూల్కర్ మాత్రం సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో వారికి దూరంగా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. తన ప్రియుడు శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ లక్నోకు వచ్చిందని, గుజరాత్ టైటాన్స్‌కే మద్దతు తెలుపుతుందని కామెంట్ చేస్తున్నారు. తమ్ముడు జట్టు అయిన లక్నో సూపర్ జెయింట్స్‌కు సపోర్ట్ చేసేందుకు అతను ఏమైనా తుది జట్టులో ఆడుతాడా? అని ప్రశ్నిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్‌కు మద్దతు తెలిపేందుకే సారా లక్నోకు వచ్చిందని, లేకుంటే తన తమ్ముడు ప్రాతినిథ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు మద్దతు తెలుపుతానని మీడియాకు తెలిపేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది ఏమైనా సొంత తమ్ముడికి సారా టెండూల్కర్ షాకిచ్చిందని, తమ్ముడు అర్జున్ టెండూల్కర్ కంటే ప్రియుడు శుభ్‌మన్ గిల్ ఎక్కువయ్యాడని కామెంట్ చేస్తున్నారు. సారా టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ తమ ప్రేమ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్తలను కూడా ఖండించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన లక్నో ఆదివారం సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. శుక్రవారం సారా టెండూల్కర్ లక్నో ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో ఈ మ్యాచ్ కోసమే సారా వచ్చిందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆమె రాకపై ఎలాంటి క్లారిటీ లేదు. బహుషా అర్జున్ సతీమణి, తన మరదలుకు తోడుగా వచ్చి ఉంటుందని, అనవసర పుకార్లు పుట్టించవద్దని సచిన్ ఫ్యాన్స్ కోరుతున్నారు.

## ఈజీగా కోల్‌కతా ప్లేఆఫ్స్ చేరే ఛాన్స్..



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రెండు బలమైన జట్లు అయిన కేకేఆర్, చెన్నై సూపర్ కింగ్స్ వరుస ఓటములతో సతమతమవుతున్నాయి. కోల్‌కతా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో కేవలం ఒక పాయింట్‌తో తొమ్మిదో స్థానంలో ఉంది. జట్టు ప్రదర్శన అభిమానులను నిరాశపరుస్తున్నప్పటికీ, రాబోయే మ్యాచ్‌ల్లో పుంజుకుంటే అద్భుతాలు చేసే అవకాశం ఉంది.ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన పోరులో కోల్‌కతా విజయం అంచు వరకు వెళ్లి బోల్తా పడింది. గెలిచే స్థితిలో ఉన్న మ్యాచ్‌ను ముకుల్ చౌదరి అద్భుత ప్రదర్శనతో కేకేఆర్ చేతుల నుంచి లాగేసుకున్నాడు. ఈ మూడు వికెట్ల తేడాతో వచ్చిన ఓటమి ఆ జట్టు ప్లేఆఫ్ అవకాశాలను మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రస్తుతం కోల్ కతా జట్టు ఖాతాలో 10 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి.ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడాలి. కోల్‌కతా ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకోవాలంటే మిగిలిన 10 మ్యాచ్‌ల్లో కనీసం 8 మ్యాచ్‌లలో ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. దీనివల్ల ఆ జట్టు ఖాతాలో 17 పాయింట్లు చేరుతాయి. సాధారణంగా 16 నుంచి 18 పాయింట్లు సాధించిన జట్టుకు నాకౌట్ దశకు వెళ్లే అవకాశం మెండుగా ఉంటుంది. విజయాలతో పాటు నెట్ రన్ రేట్ మెరుగుపరుచుకోవడం కూడా ఇక్కడ కీలకం కానుంది.వరుస ఓటముల నుంచి కోలుకోవడానికి కోల్‌కతాకు ఏప్రిల్ 14న జరిగే మ్యాచ్ ఎంతో కీలకం. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌తో ఈ మ్యాచ్ జరగనుంది. రెండు జట్లూ విజయాల కోసం ఆకలితో ఉండటంతో ఈ పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల ఖాతాను తెరిస్తేనే కోల్‌కతా తన ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అంతకంటే ముందు ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న చెన్నై జట్టు కూడా గెలుపుపై కన్నేసింది.



సెగలు రేపుతున్న ఆషిక రంగనాథ్ హాట్ అందాలు

# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు'. ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# దసరాకు రిలీజ్ చేసేలా ఫౌజీ షూటింగ్ స్పీడ్





ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అమాయకత్వంలోనే అందం


ఉప్పెన' తర్వాత నేను పూర్తిస్థాయి ప్రేమకథలో నటించలేదు. ఈ సినిమా ఆ లోటుని తీర్చింది. ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది' అని చెప్పింది కృతిశెట్టి. ఆమె ప్రదీప్ రంగనాథన్ సరసన నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. విఘ్నేశ్‌శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు.ఈ సందర్భంగా గురువారం కృతిశెట్టి విలేకరులతో ముచ్చటించింది. ఇది 2040లో జరిగే కథ అని, ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని చెప్పింది. 'ఈ తరంలో డబ్బులు లేకపోయినా ఫర్వాలేదు. కానీ ఫోన్ లేకుండా ఉండటం చాలా కష్టం. అలాంటి మనస్తత్వం కలిగిన అమ్మాయి పాత్రను పోషించాను. భవిష్యత్తులో ప్రేమ కూడా ఇన్సూరెన్స్‌లో భాగం కావొచ్చు. ఈ సినిమాలో ఆ కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది' అని చెప్పింది. ప్రేమ విషయంలో తాను మాత్రం సంప్రదాయ భావాల్ని ఇష్టపడతానని, 'సీతారామం' '96' వంటి ప్రేమకథలు తనకు ఫేవరేట్ అని, ప్రేమ తాలూకు అమాయకత్వంలోనే ఓ ఆందం ఉంటుందని, ఈ తరం ప్రేమకు తాను ఏమాత్రం కనెక్ట్ కాలేనని కృతిశెట్టి చెప్పింది.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్
# ట్రైలర్ విడుదల విడుదల




ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# వారణాసి కథ ఇదేనా?




షూటింగ్‌కు ముందే తన సినిమా కథల్ని రివీల్ చేస్తుంటారు అగ్ర దర్శకుడు రాజమౌళి. చాలా సినిమాల విషయంలో ఆయన ఇదే ఆనవాయితీని పాటించారు. అయితే 'వారణాసి' సినిమాకొచ్చేసరికి కథాంశం విషయంలో కాస్త గోప్యత పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో కథకు సంబంధించిన బేసిక్ లైన్‌ను మాత్రమే బయటపెట్టారు. టైమ్ ట్రావెల్ కథ ఇదని, రామాయణ ప్రస్తావన కూడా ఉంటుందని, ఓ ఎపిసోడ్‌లో హీరో మహేశ్‌బాబు రాముడి పాత్రలో కనిపిస్తాడనే వివరాల్ని వెల్లడించారు.అయితే అభిమానులు మాత్రం 'వారణాసి' అసలు కథేంటి అనే అన్వేషణలో పడ్డారు. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియాలో అనేక లీకులొస్తున్నాయి. తాజాగా ప్రముఖ హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ 'వారణాసి' కథ గురించి కొన్ని ఆసక్తికరమైన వివరాల్ని అందించింది. అద్భుతశక్తులు కలిగిన త్రేతాయుగం నాటి మహిమాన్విత విశ్వ కళాఖండాన్ని సాధించి, తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని సాధించాలనే దురాలోచన చేస్తాడు క్రూరుడైన కుంభ (పృథ్వారాజ్ సుకుమారన్). దాని సాధనకై శివ భక్తుడైన రుద్ర (మహేశ్‌బాబు)ను ఎంచుకుంటాడు. కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఆదేశాల మేరకు టైమ్ ట్రవెల్ చేసి ఆ శక్తిని సాధించేందుకు పూనుకుంటాడు రుద్ర. ఈ క్రమంలో అతను కొన్ని పురాతన రహస్యాలతో పాటు ఓ చీకటి నిజాన్ని తెలుసుకుంటాడు. కుంభ ఓ కుట్రదారుడని, ప్రపంచ ఆధిపత్యం కోసమే తనను ఈ కాలయాత్రకు పురమాయించాడని అర్థం చేసుకుంటాడు.ఈ నేపథ్యంలో రామాయణ కాలంనాటి ఆ కళాఖండాన్ని పొందడానికి రుద్ర ఏం చేశాడు? కుంభ కుట్రల్ని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్ర కథ అని సదరు విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఈ వార్తలో నిజమెంతో తెలియదు కానీ..సోషల్‌మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831